## క్లుప్తంగా

### అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు



కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి దేవస్థాన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం బుధవారం దేవాలయ చైర్మన్ రామినేని నాగవేణి, తిరుపతిరావు, తెనాలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయ ఈఓ సురేష్ బాబు మాట్లాడుతూ గత మూడు నెలల కాలానికి అమ్మవారికి వివిధ రకాల కానుకల ద్వారా రూ.14,34,472లు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు మండల శ్రీనివాసరావు, గుంటుపల్లి నాగేశ్వరరావు, పాలినేని రమేష్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తోటమ్మతల్లి ఆదాయం రూ.1.72లక్షలు**

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని తోటమ్మతల్లి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం గురువారం జరిగింది. బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్, భక్తుల సమక్షంలో హుండీ ఆదాయంను లెక్కించగా రూ.1,72,720లు వచ్చినట్లు ఆలయ మేనేజర్ ఆర్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గోపిశెట్టి వెంకటేశ్వరరావు, అర్చకుడు అమర్‌నాథ్‌శర్మ, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### పశుపోషకులకు బోనస్‌లు పంపిణీ

అప్పాపురం(కాకుమాను): సంగం డెయిరీలో పాలు విక్రయించే వారికి సకాలంలో బోనస్‌లు పంపిణీ చేయడంతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే సంగం డెయిరీ లక్ష్యమని ఆ డెయిరీ మాజీ చైర్మన్ క్ొల్లా వీరయ్య చౌదరి అన్నారు. మండలంలోని అప్పాపురం,కాకుమాను గ్రామాలలోని సంగం డెయిరీ పాల కేంద్రాలలో పాల విక్రయ దారులకు బుధవారం బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ నరేష్,తదితరులు పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వృద్ధుడి మృత దేహం

పెదకాకాని: చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. గత నెల జూన్ 30వ తేదిన గమిడి శ్రీను తండ్రి పేరు యలమందరాజు, వయస్సు 70, ఊరు నంబూరు అని చెప్పి ఓ వృద్ధుడు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఆ తరువాత పరిస్థితి విషమించి మరణించాడు. మృతుడు చెప్పిన అడ్రస్‌లో పెదకాకాని మండలం, నంబూరు గ్రామంగా నమోదైఉంది. పోలీసు విచారణలో నంబూరు గ్రామంలో ఆ పేరుతో ఎవరూ లేరని సమాధానం వినిపిస్తుంది. మృతుని ఆచూకీ తెలిసిన వారు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని గురువారం సీఐ బండారు సురేష్‌బాబు తెలియజేశారు.

### ఇంటర్ విద్యార్థి అదృశ్యం



విద్యార్థి రామ్‌చరణ్

తుమ్మలపాలెం(ప్రత్తిపాడు): ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన సాలిమెట్టి రామ్‌చరణ్ (16) గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలోని లక్ష్య అకాడమీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత మూడు రోజులుగా రామ్‌చరణ్ కళ్ల కలకలతో బాధపడుతున్నాడు. దీంతో అకాడమీ నిర్వాహకులు విషయాన్ని బాలుడి తల్లి దండ్రులకు తెలియజేశారు. ఈ నెల 16వ తేదీన బాలుడిని తీసుకువెళ్లేందుకు వారి బంధువులు అకాడమీ వద్దకు వచ్చారు. అప్పటికే బాలుడు ఎవ్వరికీ చెప్పకుండా అకాడమీ నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో బాలుడి తల్లి సాలిమెట్టి సలోమి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మెప్మా సీఎంఎం సస్పెన్షన్

నెహ్రూనగర్: గుంటూరు రూరల్ మండలం చౌడవరం పరిధిలోని సీఆర్ నగర్‌లో డ్వాక్రా గ్రూపుల పేరుతో ఓ ఫేక్ ఆర్పీ(రిసోర్స్ పర్సన్) లోన్లు ఇప్పించిన ఘటనలో ఆ ప్రాంత సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) పి. శ్యామలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారని పీడీ పి. వెంకటనారాయణ తెలిపారు. ప్రతిసారి కమీషన్లు తీసుకోవడంతో పాటు లోను రికవరీ చేయకుండా ఫేక్ ఆర్పీ నగదును వాడుకున్నారని ఆరోపిస్తూ సదరు కాలనీ వాసులు సోమవారం కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. బ్యాంకు నుంచి నోటీసులు కూడా వచ్చాయని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన మెప్మా మిషన్ డైరెక్టర్ సీఎంఎంను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- ప్రతిపక్షాలు అభివృద్ధి పనులకు ఆటంకాలు కలిగించడం మంచిది కాదు
- అభివృద్ధి పనులు చేయడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
- తాగు, సాగునీరు సరఫరాలో అంతరాయం కలిగిస్తే క్షమించేది లేదు
- పెదకాకాని మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



పెదకాకాని మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, పక్కన ఎంపీపీ తుల్లిమిల్లి తదితరులు

పెదకాకాని: ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని, వాటిని సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు తాగునీరు సరఫరా, సకాలంలో రైతులు పంటలు పండించడానికి కాలువలకు నీరు వదలడంలోనూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించలేదన్నారు. మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలు ఏళ్ల తరబడి తాగునీటి సమస్య ఉందన్నారు. తాజాగా రెండు గ్రామాలకు తాగునీటి సమస్య పరిరక్షించేందుకు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. టీడీపీ నాయకులు అభివృద్ధి పనులను అడ్డుకోవడం మంచిదికాదన్నారు. పార్టీలకు అతీతంగా చేపట్టిన అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలన్నారు.

**ఎటు చూసినా అభివృద్ధి వీచికలే..**

ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తుందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధారాదత్తం చేసిందన్నారు. మన బడి నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఆంగ్ల బోధనలు ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. గత పాలకులు రుణమాఫీ పేరుతో అన్నదాతలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముందుగా శిశు సంక్షేమశాఖ, ఐసీడీఎస్ అధికారులు, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణశాఖ అధికారులు ఆయాశాఖల పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుజ్జుల సుమతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, తహసీల్దార్ పి.రత్నం, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు
- మూడు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పరిశీలన



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్వర్లు

బీకేపాలెం(కాకుమాను): ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మండలంలోని బీకేపాలెం, కొమ్మూరు, చినలింగాయపాలెం గ్రామాలలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని గురువారం డీఏఓ నున్న వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని రైతులు ఏయే సీజన్‌లో ఏ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఎంత విస్తీర్ణంలో ఏ రకాల పంటలను సాగు చేస్తున్నారో అనే విషయాలను వ్యవసాయ సిబ్బంది ఫీల్డ్‌లోకి వెళ్లి పరిశీలించి ఈ-క్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. మరో వారం రోజులలో నివేదికను కార్యాలయానికి అందజేయాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఏఓ కె.కిరణ్మయి, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

## అంకిరెడ్డిపాలెంలో సీసీ డ్రైన్‌లకు శంకుస్థాపన



సీసీ డ్రైన్‌లకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ డ్రైన్‌లు, శ్మశానవాటిక ప్రహరీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటికి బోర్ల నిర్మాణాలు, పవర్‌స్టేషన్ల ఏర్పాటు, కార్యక్రమాలను చేపట్టటం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రజల ఇంటిముందుకే అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని తెలిపారు. ప్రజలు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగించుకుని రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా కృషిచేయాలని కోరారు. గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి తదితరులున్నారు.

## చలపతి ఫార్మశీలో సర్ రామ్‌నాథ్ చోప్రా జయంతి



సర్ రామ్‌నాథ్ చోప్రా జయంతి వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు

గుంటూరు రూరల్: భారతీయ ఔషధ నిపుణుడు, పరిశోధకుడు వైద్యరంగానికి గణనీయమైన కృషిచేసిన సర్ రామ్‌నాథ్‌చోప్రాను ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫార్మాకాలజీగా పిలుస్తారని చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో సర్ రామ్‌నాథ్‌చోప్రా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయ మొక్కలు, పదార్థాల ఔషధ లక్షణాలపై సమగ్ర సమాచారాన్ని అందిస్తూ మెరియా మెడికా ఆఫ్ ఇండియన్ డ్రగ్స్ అనే పుస్తకాన్ని రచించారని ఈ పుస్తకం ఆరోగ్య సంరక్షణకు, అభ్యాసకులకు ఔషధ శాస్త్రవేత్తలకు ఎంతో ముఖ్యమైన వనరుగా మారిందన్నారు. పాము కాటుపై చోప్రా చేసిన పరిశోధన, పాము విషం విరుగుడుకు సంబంధించిన చికిత్స పద్ధతులను మెరుగు పరచటంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. సమాజాభివృద్ధికి ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.భానుప్రకాష్, అధ్యాపకులు తదితరులున్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో గురువారం ఓపీ ప్రధాన ద్వారం వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ల్యాబ్‌కు తాళాలుపై ఆగ్రహం**

ఆస్పత్రిలో 24 గంటల ల్యాబ్‌ను సూపరింటెండెంట్ తనిఖీ చేశారు. ల్యాబ్‌కు తాళాలు వేసి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ తప్పనిసరిగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ల్యాబ్‌ను తెరచి ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

## భ్రమరాంబకు పసుపు కొమ్ములతో అలంకారం



శివాలయంలో అలంకరణకు సిద్ధంగా మాలలుగా తయారు చేసిన పసుపు కొమ్ములు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం పూజలు ప్రారంభమయ్యాయి. పెదకాకాని శివాలయంలో నిర్వహిస్తున్న శ్రావణమాస ప్రత్యేక పూజల్లో బాగంగా శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నంబూరు ఐజేఎం నివాసితులు జి.కిషోర్‌రెడ్డి, వాణి దంపతులు, చిలకలూరిపేటకు చెందిన శంకర్, మరొక భక్తుడు ముగ్గురూ కలసి 400 కిలోలు పసుపు కొమ్ములు అమ్మవారి అలంకరణ నిమిత్తం సమర్పించారు. శ్రావణమాసంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణల్లో బాగంగా చందన, చీరలు, గాజుల అలంకరణ చేయడం జరుగుతుందన్నారు. చివరి శుక్రవారం ముత్తయిదువులకు సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతాలు చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పసుపు కొమ్ముల అలంకరణలో ఉన్న భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలలో పాల్గొన వలసినదిగా శ్రీనివాసరెడ్డి కోరారు.

## మెరుగుపడుతున్న కానిస్టేబుల్ ఆరోగ్యం



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రమేష్ బాబుతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: దేవస్థానంలో దొంగతనానికి పాల్పడిన దుండుగల్ని పట్టుకునే ప్రయత్నంలో గాయాలై చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి క్రమేణా మెరుగుపడుతోంది. ఈనెల 5న తెనాలి వైకుంఠపురం దేవస్థానంలో దొంగల్ని పట్టుకునే క్రమంలో ఒకడు తెనాలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబును నెట్టడంతో పైనుంచి కిందపడి గాయాలయ్యాయి. గాయపడిన అతన్ని మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గుంటూరు రేంజ్ అధికారులతో మాట్లాడారు. కానిస్టేబుల్ ధైర్యసాహసాల్ని ప్రశంసిస్తూ, మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. దీంతో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజ్ అత్యవసర చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.50 వేలను గుంటూరు జిల్లా పోలీస్ వెల్ఫేర్ నిధి నుంచి తక్షణ సాయంగా అందజేశారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా కానిస్టేబుల్‌ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఇక గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పలుమార్లు ఆస్పత్రికి వచ్చారు. గురువారం మరలా ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌తో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స అందించడం వల్లే త్వరగా కోలుకున్నానని కానిస్టేబుల్, అతని కుటుంబ సభ్యులు ఎస్పీకి కృతజ్ఞతలు చెప్పారు. అనంతరం ఆసుపత్రి వైద్యుల్ని ఎస్పీ అభినందించారు. ఇంకా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఎస్పీ వెంట గుంటూరు పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, సీఐ బి.నరసింహారావు, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నిక, హాఫ్‌పేట గ్రామంలో వార్డు మెంబరు. ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 19వ తేదీన జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడి ఏర్పాట్లను అధికారులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

## మండలాభివృద్ధికి కృషి చేయాలి

**ఎంపీపీ దాసరి అన్నమ్మ**





మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి అన్నమ్మ, పక్కన ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య

ప్రత్తిపాడు: మండలాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయడం జరుగుతుందని ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య శాఖల వారీగా సమీక్షించారు. ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి నివేదికలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ అన్నమ్మ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. ఎంపీడీవో శ్రీరమ్య మాట్లాడుతూ అధికారులంతా ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాలను, మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని చెప్పారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## సైప్రో సెక్యూరిటీస్‌తో 'చలపతి' ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను చూపుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తును కల్పించాలనేది తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సైప్రో సెక్యూరిటీస్ సంస్థతో తమ కళాశాల ఎంఓయూను కుదుర్చుకుందన్నారు. ఒప్పందం ద్వారా విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీస్, ఎథికల్ హ్యాకింగ్ లాంటి టెక్నాలజీస్‌పై సాంకేతిక శిక్షణ పొంది ఉపాధిని పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంస్థ సీఈఓ చైతన్యరాణి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఉపాధి కల్పించనున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం పాల్గొన్నారు.

# పెదగొట్టిపాడులో 'టీడీపీ' ధన రాజకీయం

- రనకందాయంలో 2వ వార్డు ఉప ఎన్నికలు
- బరిలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఒకవైపు, రెబల్ అభ్యర్థి మరోవైపు
- హోరాహోరీ మధ్య పోటాపోటీగా డబ్బుల పంపిణీ
- పంచాయతీ ఎన్నికల సాక్షిగా మరోసారి బయటపడ్డ టీడీపీ వర్గ పోరు



ఈనెల 8వ తేదీన నామినేషన్ దాఖలు చేసిన టీడీపీ రెబల్ అభ్యర్థి నిమ్మగడ్డ శ్రీకాంత్

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): పెదగొట్టిపాడులో గత కొద్ది నెలలుగా టీడీపీ నేతల మధ్య జరుగుతున్న అంతర్గత పోరు ఇప్పుడు రచ్చకెక్కింది. పంచాయతీలోని ఓ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికల సాక్షిగా ఆ పార్టీలోని ఇరువర్గాలు సై అంటే సై అంటూ బహిరంగంగానే ఢీకొడుతున్నాయి. ఒక చిన్న వార్డులో పోటాపోటీగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, నోట్ల కట్టలు వెదజల్లుతున్నారు. నియంత్రించాల్సిన పంచాయతీ రిటర్నింగ్ అధికారి చేతులు దులిపేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

**350 ఓట్లు ఉన్న వార్డులో ప్రలోభాల పర్వం..**

మండల పరిధిలోని పెదగొట్టిపాడు గ్రామ పంచాయతీలో మొత్తం 14 వార్డులున్నాయి. 2వ వార్డు సభ్యురాలు గుంటుపల్లి నందీశ్వరి రాజీనామా చెయ్యడంతో ఆ వార్డు ఖాళీ అయ్యింది. దీంతో ఈ నెల 19వ తేదీన గ్రామంలో రెండవ వార్డుకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. అయితే తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిగా గుంటుపల్లి ఈశ్వరప్రసాద్ నామినేషన్ దాఖలు చేయగా, అదే పార్టీ నుంచి రెబల్ అభ్యర్థిగా టీడీపీ ఉపసర్పంచ్ నిమ్మగడ్డ ముకుంద శివరంజని భర్త నిమ్మగడ్డ శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య హోరాహోరీ వాతావరణం చోటుచేసుకుంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇరువర్గాలూ ప్రలోభాలకు తెరలేపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 350 ఓట్లు ఉన్న వార్డులో నోట్ల కట్టలను వెదజల్లుతున్నారు. బుధవారం రాత్రి గ్రామంలో ఓటర్లకు డబ్బులను యథేచ్ఛగా పంపిణీ చేశారు. ఒక్కో ఓటుకు ఒక వర్గం రూ. 5 వేలు ఇవ్వగా, మరో వర్గం రూ. 10 వేల వరకూ పంపిణీ చేసినట్లు బహిరంగంగా ప్రచారం జరుగుతుంది. నియంత్రించవలసిన రిటర్నింగ్ అధికారితో పాటు ఇతర శాఖల అధికారులు చేతులెత్తేయడంతో ఎన్నికల వాతావరణమే గ్రామంలో కనిపించడం లేదు.

**ఇందుకే అంత పోటీ..**

వాస్తవానికి ఎన్నికలు జరుగుతున్న వార్డు పూర్తిగా టీడీపీకి ఆధిక్యం ఉన్న వార్డు. ఆ పార్టీ అభ్యర్థులు మాత్రమే విజయం సాధించేందుకు పూర్తి అవకాశాలున్నాయి. కానీ ఇప్పుడు అదే పార్టీ నుంచి ఇద్దరు అభ్యర్థులు ఉండటంతో పోటీ రసవత్తరంగా మారింది. వాస్తవానికి గ్రామ పంచాయతీలో పద్నాలుగు వార్డుల్లో ఏడు వార్డుల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులు, మరో ఏడు వార్డుల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు గత ఎన్నికల్లో గెలిచారు. టీడీపీ అభ్యర్థుల్లో ప్రస్తుతం ఒక వార్డు ఖాళీగా ఉండటంతో పంచాయతీ పాలకవర్గ సమావేశాల్లో వైఎస్సార్ సీపీదే పై చేయిగా మారింది. దానికి తోడు సర్పంచ్‌పై ఉపసర్పంచ్ బహిరంగంగానే తిరుగుబాటు చేస్తున్నారు. సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఉపసర్పంచ్ మనోరంజని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో, విచారణ జరిపిన అధికారులు నిధుల దుర్వినియోగం నిజమేనంటూ నిర్ధారించి సర్పంచ్ చెక్‌పవర్‌ను మూడు నెలల పాటు తాత్కాలికంగా నిలిపివేశారు. అంతేకాకుండా గతంలో సర్పంచ్ మరియరాణి ఉపసర్పంచ్ భర్తపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టడంతో ప్రత్తిపాడు స్టేషనులో కేసు నమోదవ్వడం కూడా జరిగింది. నాటి నుంచి తీవ్ర స్థాయిలో ఉపసర్పంచ్ లోపాలను ఎత్తి చూపుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి గెలిస్తే కనీసం పరువు అయినా దక్కుతుందని ఒక వర్గం భావిస్తుంటే, ఎలాగైనా గెలిచి పంచాయతీపై పూర్తి పట్టు సాధించడంతో పాటు, తమ సత్తాను పార్టీకి వినిపించేలా చాటాలని రెబల్ అభ్యర్థి శ్రీకాంత్ చూస్తున్నారు. దీంతో ఎన్నికలో ఇంత పెద్ద ఎత్తున ప్రలోభాల పర్వం జరుగుతుంది. కాగా పై విషయమై పంచాయతీ రిటర్నింగ్ అధికారి జి. శ్రీనివాసరావును వివరణ కోరగా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడం వరకే తన పని అని తెలిపారు. ఎంపీడీఓకు విషయాన్ని చెబుతానన్నారు.

### అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



తెనాలిఅర్బన్: ఎస్ఆర్ఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన బి.అనిత, బి.శ్రీకర్, కె.రాజేశ్వరి, కె.రామ్ తేజలను గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు చదివి అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థులను పూర్వ విద్యార్థులు అభినందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘ కన్వీనర్ తన్నీరు శివశంకర్, సభ్యులు చుక్కా భానుప్రసాద్, కాసారనేని శ్రీనివాసరావు, కఠారి సీతారామయ్య, పి.నరేంద్ర, శివభాస్కర్, శ్రీను, పసుపులేటి మోహనరావు, ముద్దబత్తుని రమణయ్య, ఈఎల్‌వి. అప్పారావు, ఎన్ఆర్‌కె శర్మ, చందు నాగేశ్వరరావు పాల్గొన్నారు.